క్లుప్తంగా

లూజు విత్తనాలు కొనకండి

మైదుకూరు : వ్యాపారులు విక్రయించే లూజు విత్తనాలను రైతులు కొనవద్దని మండల వ్యవసాయ అధికారి బాలగంగాధర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని సరస్వతి పేట, గుంటూరు కొట్టాలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులకు జింక్ సల్ఫేట్, జిప్సం 50 శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తామని తెలిపారు.

మెడికల్ షాపులపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు : ప్రభుత్వ నిబంధనలను పాటించని మెడికల్ షాపులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మెడికల్ షాపు సిబ్బంది ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. నిబంధనల మేరకు ప్రతి మెడికల్ షాపులో ఫార్మసిస్టు ఉండాలన్నారు. అధికారులు ఇప్పటికైనా మెడికల్ షాపులను తనిఖీ చేసి నిబంధనలను పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డాక్టర్‌కు సత్కారం

ప్రొద్దుటూరు : స్థానిక వైఎంఆర్ కాలనీలోని బీజేపీ పట్టణ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పాలకమండలి సభ్యుడు డాక్టర్ టీడీ వరుణ్‌కుమార్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు వంకదారి నరేంద్రరావు, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు చీతిరాల నాగార్జునరావు, జిల్లా కార్యదర్శి మార్రెడ్ల మల్లికార్జునరావు, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కోశాధికారి సి.విజయలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి భాస్కర్‌రెడ్డి వరుణ్‌కుమార్‌రెడ్డిని ప్రశంసించి పూలమాలలతో సన్మానించారు.

సబ్ డీఎఫ్‌ఓ బదిలీ

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు సబ్ డీఎఫ్‌ఓగా పనిచేస్తున్న దివాకర్‌ను అనంతపురం సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌ఓగా బదిలీ చేశారు. ఈ మేరకు ప్రొద్దుటూరులోని సబ్ డీఎఫ్‌ఓ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం దివాకర్‌కు అధికారులు, సిబ్బంది సన్మాన, వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కడప డీఎఫ్ వినీత్ కుమార్, ఎఫ్ఆర్‌ఓ హేమాంజలి, అశోక్ కుమార్, ప్రసాద్, కళావతి, బాలసుబ్రహ్మణ్యం సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

కలసపాడు : కలసపాడు ఎంపీటీసీ షేక్ నాగూర్ షరీఫ్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి మంగళవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. నాగూర్ షరీఫ్‌కు తాను, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ధైర్యంగా ఉండాలని ఎమ్మెల్సీ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అంకన గురివిరెడ్డి, సూద రామకృష్ణారెడ్డి, సుదర్శన్, పురుషోత్తంరెడ్డి, చిట్టా రాజశేఖర్‌రెడ్డి, ఏవీ భాస్కర్‌రెడ్డి, రాళ్లపల్లె నరసింహులు, సింగరయ్య, ఎ.సుబ్బారెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం చెన్నారెడ్డిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ముత్తుముల జయరామిరెడ్డి బ్రెయిన్ స్ట్రోక్‌కు చికిత్స పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఆయన ఇంటికి వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

నివాళి

బద్వేలు అర్బన్: పట్టణంలోని ప్రముఖ స్త్రీ వ్యాధి నిపుణురాలు డాక్టర్ పద్మావతి తండ్రి వెంకటేశ్వర్‌రెడ్డి (82) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ కడప పట్టణంలోని కో-ఆపరేటివ్ కాలనీలో వెంకటేశ్వర్ రెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ పద్మావతి ఆమె భర్త పెద్దిరెడ్డి సతీష్‌రెడ్డి, ఆమె సోదరుడు వి.మురళీధర్‌రెడ్డిలతో మాట్లాడి ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. అలాగే తొలుత బద్వేలు పట్టణంలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి వెంకటేశ్వర్ రెడ్డికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి మౌలాలి, రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

జైలుకెళ్లడానికైనా సిద్ధం




మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి

మైదుకూరు : కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై చేసే పోరాటంలో జైలుకెళ్లడానికైనా వెరమని జెడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి అన్నారు. మంగళవారం మైదుకూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన పార్టీ నియోజకవర్గ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామగోవిందరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం కంటే వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను వేధించడమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా చంద్రబాబు మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ 2.0లో ప్రజలకు మరింత సంక్షేమం అందించేందుకు వైఎస్ జగన్ కృతనిశ్చయంతో ఉన్నారని పేర్కొన్నారు. అందుకు కార్యాచరణ మొదలైందని అన్నారు. ఈ నాలుగేళ్లు కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేసేందుకు పార్టీ కార్యకర్తలు ముందుండి కార్యక్రమాలను నడపాలని పిలుపునిచ్చారు.

బంధువులు రాక బోసిపోయిన పల్లెలు!

సొంత ఊరు కానిదైంది.. కన్నోళ్లకు ఆవేదనైంది.. పల్లె ఆత్మీయతకు దూరమై.. ఇరుగు పొరుగు వారి అనురాగాలకు భారమైంది. ప్రస్తుతం కనీస వసతులకు దూరమై సమస్యలమయమై ఊపి రాదని పరిస్థితులు పల్లెలను వెంటాడుతున్నాయి. తాత అనే పిలుపునకు దూరమైన మనుమళ్లు.. మనుమడా అనే పిలుపునకు దూరమైన తాతలు. తనవారంతా కానరారు. ఇంటిల్లిపాది కలుసుకునే దారిలేదు. పల్లె ఆట ల్లేవు.. పాటల్లేవు.. మండే ఎండలతో మక్కాం మార్చలేని పరిస్థితి. గ్రామాల్లో తాగడానికి నీళ్లు లేవు. ఉండేందుకు వసతి లేదు. ఉక్కపోతకు తాళలేక.. పట్టణాల నుంచి ఎవరూ పల్లె వైపు కన్నెత్తి చూడక పోవడంతో పలకరింపులు లేక పల్లె వాకిలి బాధపడుతోంది.

'పల్లె కన్నీరే పెడుతుందో కనిపించని కుట్రల.. నా తల్లి బందీయై పోతుందో.. కనిపించని కుట్రల'అంటూ గ్రామాల్లో కుమ్మరి, కమ్మరి, మేదరి, చాకలి, మంగళి తదితర చేతివృత్తుల దుస్థితిపై సినీ గేయ రచయిత పేర్కొన్నట్లు ప్రస్తుతం అదే పరిస్థితి గ్రామాల్లో దర్శనమిస్తోంది. పల్లెల్లో ఆత్మీయ పలకరింపు లేక లోలోన కుమిలిపోతూ.. మదనపడుతోంది.



కలసపాడు గ్రామం ఏరియల్ వ్యూ

- వేసవి సెలవుల్లో గ్రామాల్లో కనపడని సందడి
- విద్యుత్, నీటి సమస్యలతో గ్రామాలకు వెళ్లేందుకు అనాసక్తి
- నగరాలు, పట్టణాలకే పరిమితమవుతున్న యువత
- అవ్వ తాతల ఎదురుచూపులకు కడగళ్లు

బద్వేలు : వేసవి సెలువులొచ్చాయంటే పల్లెలు కళకళలాడుతుంటాయి. పిల్లా పాపలతో పట్నందారులన్నీ పల్లెల వైపు పరుగులు పెడుతుంటాయి. ఏ పల్లెలో చూసినా పిల్లలదే సందడి. కళ్లాలు, వామిదొడ్లు, సందులు, గొందులు, దారులు ఎటు వైపు చూసినా పిల్లల సందడి. కబడ్డీ, గోలీలాట, చిల్ల కట్టే, తొక్కుడు బిల్ల వంటి గ్రామీణ క్రీడలతో పాటు ఊరు చివర పొలాల్లో క్రికెట్, వాలీబాల్ తదితర ఆటలు ఆడేవారు. వాగుల్లో, వంకల్లో, బావుల్లో ఈతకు వెళ్లే వారు. అమ్మాయిలైతే దాగుడు మూతలు, అచ్చన గాయలు, తాడాట, తొక్కుడు బిల్ల లాంటి ఆటలు చెట్లకు ఊయాలలు వేసుకుని ఊగుతూ పది మంది సరదాగా ఒకచోట చేరి కబుర్లు చెప్పుకుంటూ సుఖసంతోషాలతో అలరారిన పల్లెలు ఇప్పుడు కళావిహీనంగా మారిపోతున్నాయి. గడిచిన వేసవి సెలవుల్లో పల్లెల వైపు తొంగిచూసే పిల్లల సందడి కనిపించడంలేదు. ఇప్పుడు పిల్లలు పల్లెకు వెళ్లాలన్న ఆసక్తి చూపడం లేదు. బొట్టుకూ పనికిరాని పట్టణం ఆట పాటలకు అలవాటు పడిన యువత పల్లెకు వెళ్లాలన్న ఆలోచనా సరళికి దూరమవుతున్నారు.


పెద్దల ఎదురు చూపులు ఎండమావులే

వేసవి సెలవులకు ఎక్కడెక్కడో చదువుకుంటున్న పిల్లలు.. ఉపాధికి, ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ ఎక్కడో దూరంగా స్థిరపడిన కుమారులు, కుమార్తెలు వారి పిల్లలైన మనుమళ్లు, మనుమరాళ్లు వస్తారని కళ్లల్లో వత్తులు వేసుకుని జేజీ, అబ్బ, అవ్వతాతలు ఎదురు చూసేవారు. కానీ రోజులు చాలా వేగంగా మారిపోయాయి. సెలవులకు సొంత ఊర్లుకు వెళ్లే వారు తగ్గిపోతున్నారు. ఇప్పుడు పల్లెల్లో ఏముందనే ధోరణి పిల్లల్లో పెద్దల్లో పెరిగిపోతోంది.

కక్షలు పెరిగి.. సంతోషాలు తరిగి

ఒకప్పుడు పల్లెలు బాంధవ్యాలతో వెలిగిపోయాయి. రాను రాను పల్లె ముంగిట కక్షలు కార్పణ్యాలు పొగబెడుతున్నాయి. చుట్టుపక్కల వారికి ఒకరి కొకరికి మాటలు దూరమయ్యాయి. అంతేగాకుండా పల్లెలకు వచ్చిన చిన్నారులు, యవత అటపాటలతో అలసిపోయి కాసేపు సేద తీరేందుకు ఫ్యాన్ దగ్గర కూర్చుని స్విచ్ వేసుకుంటే ఫ్యాన్ తిరగదు. కడుపు చల్ల చేసుకునేందుకు తాగడానికి చల్లని నీరు దొరకదు. రాత్రైతే నిద్రించడానికి అవసమమైన వసతులు ఉండవు. సెల్ ఫోన్ చార్జింగ్ ఉండదు.. పనిచేయవు.. పల్లెలతో విడదీయరాని బంధం పెనవేసుకున్న పట్నం వాసులను ఇప్పుడు విద్యుత్ రూపంలో విడగొట్టి పల్లె వాసనలను పట్నం వాసులకు దూరం చేసింది. అంతే గాకుండా ఇప్పుడు పట్టణంలో చదువుకుంటున్న యువత వేసవి సెలవుల్లో ఏదో ఒక శిక్షణ పేరుతో అక్కడే ఉండిపోవడానికి ఇష్టపడుతున్నారు. దీంతో పల్లెలు బంధాలకు దూరమవుతున్నట్టు పరిస్థితులు మారాయి.


విలువలు తగ్గిపోతున్నాయి



ఉమ్మడి కుటుంబాలు విశ్చిన్నమయ్యాయి. ఉద్యోగాల పేరుతో ఎక్కడో దూరంగా ఉంటున్నారు. పిల్లలకు సెలవులు వచ్చినప్పుడు వారి తల్లిదండ్రులకు సెలవులు ఉండవు. అందునా పల్లెలు ఇప్పుడు మారిపోయాయి. ప్రేమలకు బదులు ఒకరిపై ఒకరు ద్వేషాలు పెంచుకుంటున్నారు. మా చిన్నప్పటి మాదిరి కలిసి మెలిసి ఉండటం లేదు. పట్టణాల్లో ఉన్న సౌకర్యాలు పల్లెలలో ఉండవు. కరెంట్ ఉండదు. అందుకే తల్లిదండ్రులు కూడా పట్నం నుంచి పిల్లలను పల్లెలకు పంపించేందుకు ఇష్టపడటంలేదు.

– సి.వీరస్వామి విశ్రాంత ఉపాధ్యాయుడు, కలసపాడు

బావులు, వంకలు లేవు.. బంధుప్రీతి లేనేలేదు



ఒకప్పుడు సెలవులు వచ్చాయంటే పిల్లాపాపలు పట్నం నుంచి పల్లెలకు పరుగు పెట్టేవారు. ముఖ్యంగా ఈత కొట్టేందుకు యువకులు ఆసక్తి చూపేవారు. కానీ ఇప్పుడు ఈత కొట్టేందుకు దిగుడు బావులు లేవు. నీళ్లు లేవు. వాగులు వంకలు ఉన్నా అందులో నీళ్లు లేవు. తాగేందుకే నీటి కరువు వచ్చింది. అంతేగాకుండా గతంలో మాదిరి పల్లెల్లో ప్రేమలు, అనురాగాలు కరువయ్యాయి. అందుకే పట్నం నుంచి ఎవరూ రావడంలేదు. దీంతో బాంధవ్యాలకు పల్లెలు దూరమయ్యాయి.

– ఎన్.వెంకటసుబ్బారెడ్డి, ఎత్తిరాజుపల్లె, బద్వేలు మండలం

20లోపు ఇ-కేవైసీ చేయించుకోవాలి



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి

బి.కోడూరు : మండల పరిధిలోని బి.కోడూరు, రామసముద్రం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కౌశిక మాట్లాడుతూ రైతులు స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొని వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే పథకాల గురించి తెలుసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ, పి.ఎం. కిసాన్, సూక్ష్మ పోషకాల ప్రాముఖ్యత గురించి వివధ రకాల పంటల్లో విత్తన శుద్ధి పద్ధతులపై అవగాహన పొందాలన్నారు. పెండింగ్ లిస్టులో ఉన్న రైతులందరూ అన్నదాత సుఖీభవ పథకానికి ఈ నెల 20లోపు రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి ఇ-కేవైసీ అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వినోద్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

అలరించిన కోలాటం



దీపాలను తలపై పెట్టుకుని కోలాటం చేస్తున్న మహిళలు

రాజుపాళెం : రాజుపాళెం ఇందిర కాలనీలో శ్రీరామ్ కోలాట బృందం సోమవారం రాత్రి నిర్వహించిన కోలాటం అందరినీ అలరించింది. గజ్జ పూజ కార్యక్రమం సందర్భంగా మాస్టర్లు రాజేష్, పందు ఆధ్వర్యంలో కోలాటం నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజాము వరకూ జరిగిన వేడుకను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

రైతుల ద్వారా విషయ పరిజ్ఞానం



రైతు సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు, ఉద్యాన కళాశాల విద్యార్థినులు

మైదుకూరు : రైతుల ద్వారా విద్యార్థులు పంటల సాగులో విషయ పరిజ్ఞానాన్ని తెలుసుకోవాలని మైదుకూరు మండల వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని లెక్కలవారిపల్లెలో రైతు సదస్సును నిర్వహించారు. అనంతరాజుపేట ఉద్యాన కళాశాల విద్యార్థులు గ్రామీణ ఉద్యాన పని అనుభవ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ సదస్సులో డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ పని అనుభవ కార్యక్రమం విధి, విధానాలు, రైతులకు ఉపయోగాల గురించి వివరించారు. ఉద్యాన కళాశాల కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ రామయ్య మాట్లాడుతూ ఉద్యాన పంటల్లో రకాలు పంటల సాగులో సస్యరక్షణ గురించి తెలియజేశారు. కళాశాల ఉద్యాన శాస్త్ర అధ్యాపకుడు చంద్రమోహన్‌రెడ్డి ఉద్యాన పంటల సాగులో యాజమాన్య పద్ధతులను వివరించారు. కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ కాంతిశ్రీ ఉద్యాన పంటల్లో విలువ ఆధారిత తయారీ గురించి తెలిపారు. మైదుకూరు మండల ఉద్యాన అధికారి రామకృష్ణ ఉద్యాన పంటల్లో ప్రభుత్వ పథకాలను తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జయభారత్ రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీదేవి, బీపీ ప్రతాప్‌రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో రైతులకు తీరని నష్టం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఖాజీపేట : వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే రైతులకు ఎంతో మేలు జరిగిందని, కూటమి పాలనలో రైతులకు తీరని నష్టం కలుగుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ పీవీ రాఘవరెడ్డి అన్నారు. ఖాజీపేటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా మాజీ సీఎం జగన్ పాలించారని అన్నారు. రైతులకు రైతు భరోసా ఇచ్చేవారని అన్నారు. కానీ కూటమి పాలనలో రైతులకు భరోసా కనిపించడం లేదన్నారు. అలాగే రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు పంటలకు కావాల్సిన సూచనలు అందించేవారన్నారు. కానీ నేటి పాలనలో ఎరువులు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపడం మినహాయించి కూటమి ప్రభుత్వం సాధించింది శూన్యం అన్నారు. ఇప్పటికైనా పార్టీ కార్యకర్తలను వేధించడం మానుకొని పాలనపై దృష్టి పెట్టి చిత్త శుద్ధితో పనిచేయాలని హితువు పలికారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మురళీమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

వరిలో కాలిబాటలు తప్పనిసరి



నారుమడిని పరిశీలిస్తున్న ఏడీఏ, ఏఓలు

అట్లూరు : రైతులు వరినాటే సమయంలో కాలిబాటలు వదులుకోవాలని తద్వారా చీడపీడలు ఉధృతి తగ్గుతుందని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. మండల పరిధిలోని పాత అట్లూరులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం స్థానిక వ్యవసాయ అధికారి జి.రామకృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నారు మడులను పరిశీలించడంతో సాగులో ఉన్న సజ్జ పైరును పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ వరి సీజన్ మొదులు కానుందని ప్రతి రైతూ తూర్పు పడమరగా కాలిబాటలు వదులు కుని వరినాట్లు వేసుకోవాలన్నారు. దీంతో పైరుకు గాలి వీచడంతో పాటు కాలిబాటల ద్వారా ఎరువులు చల్లుకోవడానికి అనువుగా ఉంటుందన్నారు. పైరుకు గాలి బాగా తగలడంతో చీడపీడలు కొంత మేర అదుపులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు అరుణ, ప్రేమ్‌కుమార్, రామమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి

కాశినాయన : రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని ఏఈఓ రవి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని జొన్నవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులు పచ్చి రొట్ట ఎరువులు, పశువుల, మేకల ఎరువులను పంట పొలాల్లో వేసి కలియదున్నాలన్నారు. ప్రతి రైతు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించడం వల్ల పంటలకు చీడపీడలు సోకకుండా ఉంటాయన్నారు. పంటల సాగుపై రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు మధు, ప్రజలు పాల్గొన్నారు.

పశు వైద్యులకు ఘనంగా వీడ్కోలు



బదిలీపై వెళుతున్న పశువైద్యులకు సన్మానం

బ్రహ్మంగారిమఠం : పశువైద్యాధికారుల సాధారణ బదీలలో భాగంగా బ్రహ్మంగారిమఠం పశువైద్య సహాయక సంచాలకుల పరిధిలో ముగ్గురు డాక్టర్లు బదిలీపై వెళ్లారు. మంగళవారం బి.మఠంలోని ప్రభుత్వ పశువైద్యశాలలో బదిలీపై వెళ్లే డాక్టర్లు పెద్దిరాజుపల్లెలో పనిచేస్తున్న నిత్యానంద్, బి కోడూరు లక్ష్మినరసయ్య, ప్రభలవీడు భరద్వాజా కృష్ణలకు ఘన సన్మానించారు. అలాగే కొత్తగా పెద్దిరాజుపల్లెకు డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి, బి.కోడూరుకు డాక్టర్ స్నిగ్ధప్రణీత, ప్రభలవీడుకు డాక్టర్ హేమలత వచ్చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా పశువైద్యాధికారి (జేడీ) శారదమ్మ మాట్లాడుతూ కొత్తగా పశువైద్యశాలలకు వచ్చిన డాక్టర్లు పశువుల రైతుల సలహాలు ఇస్తూ వారికి కావాల్సిన సూచనలు చేయాలన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య, పశువైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అంతకు ముందు జేడీని పశువైద్యాధికారులు ఘనంగా సన్మానించారు.

బాబూ.. అధికారం శాశ్వతం కాదు

- ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయి
- మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



'జగన్ అంటే నమ్మకం చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి

మైదుకూరు : రాష్ట్రంలో అరాచక పాలన చేస్తున్న చంద్రబాబు అధికారం శాశ్వతం కాదని తెలుసుకోవాలని వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ వారిని భయభ్రాంతులకు గురిచేయడమే చంద్రబాబు ఉద్దేశమని రఘురామిరెడ్డి ఆరోపించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా దివంగత నేత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి తదితరులు నివాళి అర్పించారు. అనంతరం పార్టీ కేంద్ర కార్యాలయం కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై ప్రచురించిన 'జగన్ అంటే నమ్మకం చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి, నియోజకవర్గ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా చంద్రబాబు చేసిన మోసాన్ని ప్రజలు గుర్తించారని అన్నారు. తాము అన్ని విధాలా నష్టపోయామని తెలుసుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కుంటుపడిందని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారని తెలిపారు. మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని ఆరోపించారు. 2014లోనూ హామీలను నెరవేర్చకుండా ప్రజలను చంద్రబాబు మోసం చేశాడని విమర్శించారు. అందువల్లే 2019లో వైఎస్సార్‌సీపీకి ప్రజలు 151 సీట్లను కట్టబెట్టారని తెలిపారు. తానేం చెప్పినా ప్రజలు నమ్ముతారని భావించిన చంద్రబాబు మొన్నటి ఎన్నికల్లోనూ సూపర్ 6.. మరికొన్ని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఏడాది వరకు వేచి చూసిన వైఎస్సార్‌సీపీ ఇటీవల వెన్నుపోటు పేరుతో చంద్రబాబు మోసాన్ని ఎండగట్టిందని తెలిపారు. ఆ కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా తండోపతండాలుగా పాల్గొని ప్రభుత్వంపై వ్యతిరేకతను వెలిబుచ్చారని తెలిపారు. వెన్నుపోటుతో చంద్రబాబుకు గుండె పోటు వచ్చి భయపడ్డాడని.. ఏదో ఒకటి చేయాలని తల్లికి వందనం అమలుకు చర్యలు చేపట్టాడని పేర్కొన్నారు. అయితే అది కూడా సక్రమంగా అమలు చేయడం లేదని ఆరోపించారు.

ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయి..

అభివృద్ధి, సంక్షేమం మరచిపోయి హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబుకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. ఇటీవల పొదిలిలో పొగాకు రైతులకు సంఘీభావం తెలిపేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెళ్లగా వేలాదిగా ప్రజలు వచ్చారంటే అది కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకతతోనే అని అన్నారు. సత్తెనపల్లెలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లడానికి అనుమతి అడిగితే కూటమి ప్రభుత్వం అనుమతి ఇవ్వబోమని చెప్పడం శోచనీయమన్నారు. మనం ఎక్కడున్నాం పాకిస్థాన్ లోనా భారత దేశంలోనా అని ప్రశ్నించారు. ఒక మాజీ సీఎం తన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించడానికి అనుమతి కోరితే లేదంటుందంటే చంద్రబాబు ప్రభుత్వం ఎంత దిగజారిపోయిందో అర్థం అవుతుందని అన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఇలా చేసి ఉంటే లోకేష్ యువగళం నిర్వహించేవాడా అన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకంగా మాట్లాడితే కేసులు పెడుతున్నారని ఆరోపించారు. పులివెందులలో వైఎస్ విగ్రహానికి కట్టిన టీడీపీ జెండాలను తొలగించినందుకు 12, 14 ఏళ్ల పిల్లలపై కేసులు పెట్టడం దారుణమన్నారు. ఇటీవల టీడీపీ చేయించిన సర్వేలో రాయలసీమలో వారి పార్టీకి చెందిన 50 మందికి గడ్డు పరిస్థితులు ఎదురవుతాయని తేలిందని వివరించారు. వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి నేట్లపల్లె శివరాం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన అవినీతి, అరాచకాలకే పరిమితమైందని ఆరోపించారు. రాబోవు రోజుల్లో వైఎస్సార్‌సీపీ పోరాడాల్సింది చంద్రబాబు ఒక్కరితోనే కాదని వారి ఎల్లో మీడియాతో కూడానని అన్నారు. అధికార భాషా సంఘం మాజీ సభ్యుడు తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ జెండా మోసిన వారితోపాటు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికి మేలు చేశారని పేర్కొన్నారు. పార్టీ మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కిరణ్మయి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని ఆరోపించారు. రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జి.నాగిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రైతులకు ఇన్పుట్ సబ్సిడీ, రైతు భరోసా, గిట్టుబాటు ధర ఏమి లేవన్నారు. సమావేశంలో దువ్వూరు, చాపాడు ఎంపీపీలు జయచంద్రారెడ్డి, తెలిదేల లక్ష్మయ్య, మైదుకూరు వైస్ ఎంపీపీ రఘురామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కేపీ లింగన్న, మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మహబూబ్ షరీఫ్, వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొక్కం సంజీవయ్య, కౌన్సిలర్ వెంకటసుబ్బన్న, కోఆప్షన సభ్యుడు ట్రాక్టర్ గౌస్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గుడిపాడు బాబు, సర్పంచ్‌లు నాగేంద్రబాబు, గౌస్‌లాజం, ఎంపీటీసీ ఇర్షాద్, రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, ఖాదర్, మాబు చాన్ పాల్గొన్నారు.

విచ్చలవిడిగా విద్యా సామగ్రి అమ్మకం

ప్రొద్దుటూరు : జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాం, షూస్, బ్యాగ్, ఇతర విద్యా సామాగ్రి విచ్చలవిడిగా అమ్ముతున్నాయని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా స్కూళ్ల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా వాటిని ముద్రించి తమకు అనుకూలమైన రేట్లకు అమ్ముతున్నారని విమర్శించారు. సంబంధిత అధికారులు ఈ విషయంపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు.

విద్యార్థులకు సహకారం

రాజుపాళెం : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దాతల సహకారం అభినందనీయమని ఎంఈఓ రామస్వామిరెడ్డి తెలిపారు. మండలంలోని పగిడేల ప్రాథమిక పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రొద్దుటూరు రామేశ్వరానికి చెందిన కుమ్మితి వాసుదేవ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన భార్య ప్రసన్నకుమారి, కుమారుడు లోకేశ్వర్‌రెడ్డి రూ.14వేల విలువ చేసే నోట్ పుస్తకాలు, పెన్నులు, పలకలు, అట్టలను తదితర వస్తువులను అందించారు. కార్యక్రమంలో కె.వసుంధర, రాధా, ప్రసాద్, శ్రీదేవి, బాంధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఖాజీపేట తహసీల్దార్‌గా రమణమ్మ

ఖాజీపేట : మండల తహసీల్దార్‌గా ఏవీ రమణమ్మ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన మహబూబ్‌బాషాను కలెక్టర్ ఆదేశాల మేరకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఒంటిమిట్టలో పనిచేస్తున్న రమణమ్మను ఇక్కడ నియమించారు. కార్యాలయంలో మంగళవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు.

ఎస్టీ కాలనీలలో ప్రత్యేక శిబిరాలు



సేవలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

గోపవరం : అన్ని ఎస్టీ కాలనీలలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వారికి అవసరమైన సేవలను అందించాలని అడిషనల్ కమిషనర్ పి.ఆర్. – ఆర్.డి. ఆదేశాల మేరకు ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు శిబిరాలు నిర్వహించనున్నట్లు గోపవరం పంచాయతీ కార్యదర్శి విజయకుమార్ తెలిపారు. ఈ మేరకు గోపవరం ఎస్టీ కాలనీలలో మంగళవారం సచివాలయ సిబ్బందితో కలిసి ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ శిబిరాల ద్వారా ఆధార్, రేషన్, ఆయుష్మాన్ భారత్, ఇన్కమ్ సర్టిఫికెట్, పి.ఎం. కిసాన్, జనధన్ ఖాతా ఈ ఆరు సేవలను వంద శాతం గిరిజనులకు అందించనున్నట్లు తెలిపారు. ఇంటింటికి వెళ్లి పైన తెలిపిన సూచనల మేరకు కుటుంబానికి సంబంధించి అవసరమైన సేవలను నమోదు చేసుకొని సచివాలయం ద్వారా వారికి అందించనున్నట్లు తెలిపారు. 15 రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు పేర్కొన్నా. ప్రతి రోజు ఏఏ సేవలు అందిస్తున్నారనే విషయం సంబంధిత కమిషనర్‌కు నివేదిక పంపనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఎస్టీ కాలనీ వాసులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ విజయ్, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రవీణ, ఏఎన్ఎం సుజాత పాల్గొన్నారు.

పంటల సాగులో మెలకువలు పాటించాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

చాపాడు : పంటలు సాగు చేసే సమయంలో రైతులు మెలకువలు తప్పనిసరిగా పాటించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ కృష్ణమూర్తి పేర్కొన్నారు. మండలంలోని చాపాడు, పల్లవోలు గ్రామాలలో మంగళవారం వ్యవసాయాధికారి దేవి పద్మలత ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చాపాడులో జరిగిన సమావేశానికి హాజరైన ఏడీఏ మాట్లాడుతూ. వ్యవసాయాధికారులు సూచనల మేరకూ దుక్కులు, విత్తనం, ఎరువులు వేయడం, పురుగు మందులు చల్లడం వంటి వాటిపై రైతులు అవగాహన కల్పించుకోవాలన్నారు. మండలంలో ప్రధానంగా వరి పంట సాగు చేస్తారని, వరి నాటు వేసే సమయంలో తక్కువ పిలకలు(ఒకటి నుంచి మూడు) మాత్రమే నాటాలన్నారు. నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువుల వాడే విధానంలో తెలుసుకుని పంటకు సరిపడేంత మాత్రమే వేయాలన్నారు. రైతులకు జింక్ సల్ఫేట్, జిప్సం ఎరువులు సబ్సిడీలో అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని, అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతకుంట మహబూబ్ బీ, వీఏఏ గోపిరామ్ తదితరులు పాల్గొన్నారు.